కథానిక

# అభినవ శాకుంతలం

"వనశ్రీ"

సాయంకాలం పార్కులో కూర్చొని పచ్చగడ్డి గోళ్ళతో గిల్లుకుంటూన్న శివం వంటికి చల్లగాలి తగలగానే తల పైకెత్తి చూశాడు. దట్టంగా కారుమబ్బులు కమ్ముకొస్తున్నాయి. మెరుపులు వురుములూ సాగినై. పార్కులో వున్న జనం ఒక్కొకళ్ళే లేచి వెళ్ళిపోతున్నారు. చేతిలో వున్న సిగరెట్ ఆఖరిదమ్ములాగి అవతల పారేసి, లేచినుంచున్నాడు శివం వెళ్ళుదామని.

కాని రేడియోలో వినిపిస్తూన్న 'దిల్ కే తుకిడే తుకిడే!' పాట శివాన్ని నిలేసింది. మెరుస్తోన్న ఆకాశంవంక చూస్తూ, పాటవింటూ, తన్మయుడైపోయి నుంచున్నాడు. మెల్లగా చినుకులు పడుతున్నాయి.

వర్షంలో తడిస్తే జలుబుచేస్తుందని బి. ఏ. ఫస్టుక్లాస్‌లో పాసయిన శివానికి తెలియంది కాదు. ఆలశ్యంగా హోటలుకు పోతే అయ్యరు పెట్టేదేమిటో మూడుసంవత్సరాలనుంచీ హోటలు కూడు తింటోన్న శివానికి తెలియంది కాదు. అయినా నుంచున్నాడు. దానిక్కారణం లతా మంగేష్కర్ పాడుతోన్న పాటలోని "దిల్" లాంటి "దిల్" శివానిక్కూడా వొకటి వుండడం. ఆ వున్నది వున్నపాటున వూరుకోక అప్పుడప్పుడు "తుకడే" అవుతూ వుండడమూను! అలాంటి పాటలు వింటూన్నంతసేపూ శివానికి ఏదో బరువుదించుకొంటూన్న ఆనందము కలుగుతూంటుంది. అందులో అతని తప్పేమీ లేదేమో? అసలు శివానికి హృదయమనేది వొకటుండడంలో అతనితప్పెంతవుందో అది అప్పుడప్పుడూ ముక్కలు ముక్కలుగా పగిలిపోతూ వుండడంలో అంతే వుంది. చినుకులు జోరుగా సాగినై, మంగేష్కర్ పాట అయిపోగానే "ప్రియా! మై మజ్‌బూర్ హుం!" అంటూ కూనిరాగం తీస్తూ బరువుగా అడుగులేసుకుంటూ బయలుదేరాడు శివం.

కత్తిరించిన సరివిచెట్ల చాటునుంచి బయటికొచ్చి యిద్దరు నవయువతులు శివాన్ని రాసుకుంటూ దూసుకు పోయారు. అలా ఆ అమ్మాయిలు రాసుకొన్నప్పటి స్పర్శా; వాళ్ళు వెళ్తున్నప్పుడు తగిలినగాలీ ఆ రెండే యింతవరకూ శివం హృదయాన్ని తుకడే తుకడే చేసివేస్తున్నాయి! రెండు జడలూ, హైహీల్సూ టైట్ ఫిట్ రోబ్సునూ.

అలాపోతూన్న యిద్దర్లో, ఓ జెడ ముందుకూ, వో జెడ వెనుక్కూ వేసుకున్నావిడను చూసేసరికి శివానికి గుండెల్లో ఏదో కదలబారింది. ఆమే నేమో? ఆఁ అలాగేవుంది! ఆఁ అంతే. దమయంతే! శివం నడక వేగం హెచ్చించాడు. యువతులిద్దరూ పార్కు గేటుదాటి మలుపు తిరిగారు.

శివం గేటుదాటి రోడ్డుమీద కొచ్చేసరికి వాళ్ళిద్దరూ రిక్షాఎక్కి కూర్చొన్నారు. రిక్షా వేగంగా పోతూంది. మునిసిపాలిటీ లైట్ల కాంతిలో కూర్చున్నవాళ్ళ రెండు రెళ్ళు నాలుగుజడలు మాత్రం కనిపించినయి శివానికి.

అలా హోటలుకుపోయి నాలుగు మెతుకులు తిని, తిన్నగా గదికిపోయాడు. సరిగా గదికి చేరేసరికి వాన జోరైంది. తుండుగుడ్డతో తల తుడుచుకొని, కిటికీ చెక్కలుమూసి, తలుపు దగ్గరగా వేసి కాంప్ కాట్ మీద పడుకొన్నాడు. బయట వాన జోరూ, గాలిహోరూ. రెక్కల పురుగులు ఎలెక్ట్రిక్ దీపాన్ని ముసురుకొంటున్నాయి. శివం బుర్రలో రెక్కలపురుగుల్లా ఆలోచనలు లేచి సాగిపోతున్నాయి.

తను కాలేజిలో బి.ఏ. చదువుతోన్న రోజుల్లో ఆ అనుభవాలూ, ఆ జీవితం, ఎంత మధురంగా వుండేది? తన్ను మాగజైన్ కమిటీ మెంబరుగా ఎన్నుకొన్నరోజున దమయంతి తనకేసి యెలా చూసింది? కాలేజీ నాటకాల్లో దమయంతీ తనూ వేసిన వేషాలు? దమయంతి హృదయం మొదటిసారిగా తనకు అర్థమైంది. ఆరోజు గ్రీన్‌రూంలోనే కదూ? శకుంతల వేషంలో దమయంతి

దుష్యంతుడి వేషంలోవున్న తనూ. ఆ తళుకుల కిరీటం, జరీదుస్తుల్లోవున్న తనని తన కళ్ళల్లోకి ఎలా చూసింది? తన రక్తం ఎంతవేగంగా ప్రవహించింది? గుండెలు ఎంతవేగంగా కొట్టుకొన్నాయి? అప్పుడు దమయంతితో మాట్లాడబోతే పెదవులు ఎందుకు అట్లా వణికిపోయాయి? గొంతుకూడా పూడి పోతేను——

బయట కడవపోతవర్షం; వురుములూ, మెరుపులూ ఈదురుగాలి. చలిచలిగావుంది. శివం దుప్పటి గుండెలవరకూలాక్కొనికప్పుకొన్నాడు.

శివం బి. ఏ. పాసయ్యాక ఓ సంవత్సరం వుద్యోగం సంపాదించే ప్రయత్నంలో గడిపాడు. చదువుకొంటూన్న రోజుల్లో చేదామని వూహించుకొన్న వుద్యోగం దొరకటానికి మరో జన్మఎత్తి పుట్టాలనేది తెలియటానికి శివానికి ఓ సంవత్సరం పట్టింది. అదీ ఆర్థిక పరిస్థితి నెత్తిమీద తంతూంటేను. తర్వాత తను చదువుకొన్న కాలేజికి ఎదురుగా వున్న కో ఆపరేటివ్ బేంకిలో గుమస్తాగా చేరాడు. చేరి దాదాపు ఎనిమిది నెలలు కావొస్తూంది. అగ్రహారంలో పదిహేను రూపాయలుపెట్టి వొగది అద్దెకు తీసుకున్నాడు. హోటలు భోజనం. రాత్రిళ్ళు తీరిక సమయాల్లో గతించిన అనుభూతులతో కాలక్షేపం. అటువెనకా ఎవరూలేరు. తండ్రి తను పుట్టిన సంవత్సరంలోనూ, తల్లి కాలేజీలో చేరిన సంవత్సరంలోనూ శివాన్ని విడిచిపెట్టి కళ్లు మూశారు. మేనమామ వాడుకొంటూన్న యిళ్ళ చోటు మినహా మిగతాపొలం పుట్రా అమ్ముకొని చదువుకొన్నాడు. నాలుగు సంవత్సరాల నుంచీ సొంతవూరు ఎటువున్నదో తెలియదు. బస్తీలోనేవుండి జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు.

మధురమైన స్మృతుల్ని నెమరువేసుకుంటూ బయట వానరొదవింటూ మత్తుగా నిద్రలోకి జారిపోతొన్న శివం, హఠాత్తుగా తలుపులు తెరచుకొన్న మోతవిని మంచమీదనుంచి లేచి తడుముకొంటూ గోడదగ్గరకుపోయి స్విచ్ వేశాడు.

మూడుసంవత్సరాలుగా తన ప్రేమను నిరాకరించుతూవచ్చిన దమయంతి ఎదురుగా నుంచొని వుంది. వానగాలి దమయంతి వెనగ్గా తోసుకొని గదిలోకి వస్తోంది. తడిచి ముద్దయిపోయిన దమయంతి జార్జెట్ చీరమడతల్లోంచి నీళ్లుకారి గచ్చుమీద ప్రవహిస్తున్నాయి.

తడిసి వంటికి అతుక్కుపోయిన గులాబివన్నె లినెన్ బ్లౌజూ, నీలివర్ణపు చీరమడతల లోంచి తొంగిచూస్తూన్న యవ్వనపు వంపులు, విశాలమైన కళ్ళపై బరువుగావాలిన కనురెప్పలూ, వానకు తడిచిన నున్నటి చంపలపై పడుతొన్న పట్టుకుచ్చులాంటి ముంగురులూ, విద్యుద్దీప కాంతిలో నీడలీనుతూన్న పచ్చని శరీరం; నిశ్చలంగా నుంచొన్న దమయంతిని తన మధుర స్మృతుల్లోని దేవకన్యను, తనకలల్లోని నాయికిని చూసి శివం నివ్వెరపడి పోయాడు! అందులో అలా వంటరిగా రాత్రిపూట తనగదిలోకి రావడం ఓక్షణకాలం "కలయో, వైష్ణవమాయయో"అన్న సందేహంలో పడి పోయాడు శివం.

"దమయంతీ! ఏమిటీ యిలావచ్చావ్?"

"శివం! క్షమించు! ఇంతకాలం నిన్నర్థం చేసుకోలేక పోయాను." పూడిపోయిన గొంతు పెకలించుకొని అంది దమయంతి.

అలా దమయంతి వచ్చినపని ముక్కుసూటిగా చెప్పటం శివానికి ఆనందాన్ని కలిగించింది. హృదయం తేలికపడింది. అయినా అతని కడుపులో యింకా ఆశ్చర్యం, అనుమానాలు కదులుతూనే వున్నై.

"ఇంతరాత్రిపూట వర్షంలో వొంటరిగా రావాల్సినకారణం?"

"కారణాలకేం చాలావున్నై! వుండే వచ్చాను."

"సరే! ముందా తడిచీర మార్చుకో!" పిరికి పిరికిగా అన్నాడు శివం. సిగ్గుతో ఎర్రబడ్డ చెక్కిళ్ళతో అదోమాదిరిగా చూసింది ప్రియురాలు ప్రియుణ్ణి.

శివం పెట్టెతీసి, పైజామా, కాలర్బనీన్ తీసి ఆమె ముందుపెట్టి, తను ఫ్లాస్క్ తీసుకొని టీ షాపుకు వెళ్ళాడు. టీ, ఫలహారం తీసుకొని తిరిగొచ్చేసరికి, దమయంతి, పైజామా, బనియన్ వేసుకొని సినిమాల్లోని నాయికిలా కుర్చీలో కూర్చొని సినిమాపత్రిక తిరగేస్తోంది.

ఆ వేషంలోవున్న దమయంతిని చూడగానే శివానికి మళ్ళీ కాలేజిలో నాటకాలువేసినరోజులు గుర్తొచ్చాయి. అప్పటికే దమయంతి సగం తన మనిషి అయిపోయినట్టుగా వుంది శివానికి.

టీ తాగుతూ దమయంతి అంది:

"మా నాయన బాగా డబ్బున్న ఓ ముసలాడికిచ్చి పెళ్లిచేయాలనే ప్రయత్నంలోవున్నాడు!"

"ఏ వూళ్ళో?"

"మావూళ్ళోనే! ఆ ముసలాడు బాగా సంపాదిస్తున్న లాయరు. అయినా ఆ పెళ్ళి నాకిష్టం లేదు. మానాన్న చేసే వత్తిడి భరించలేక యిలా వచ్చేశాను."

"అయితే ఎంతకాలం ఇలా తప్పించుకు తిరుగుతావు?"

"ఏ నుయ్యో గొయ్యో చూసుకొనేదాకా! మగాళ్ళూ, వాళ్ళ ప్రేమలమీద నమ్మకం నశించాక ఆడది ప్రేమించగలిగింది ఒక్కటే, ఆత్మహత్య."

"ఆఁఆఁ! ఏమిటా పిచ్చిమాటలు దమయంతీ? ఇంకొంచెంవున్న టీ; తాగు" అంటూ ఫ్లాస్కు తీసి కప్పులో పోశాడు శివం.

"నాకిక వద్దండీ! మీరు తాగండి!"శివంచేతిని ఓ చేత్తోపట్టుకొని రెండోచేత్తో టీ కప్పును అందించింది. ఆ స్పర్శకు శివంలో ఎండుకుపోయిన ఆశలు చిగురించినై.

తర్వాత వారంరోజులకు దినపత్రికలో,'ఆదర్శ వివాహం'శీర్షికకింద దమయంతీ, శివం ఫొటోలు ప్రకటించబడినై—మెళ్ళో పూలదండతోసహా.

* * *

"అబ్బాయ్ శివం! ప్రయాణం సంగతేమనుకున్నారు?" కూతుర్ని పుట్టింటికి తీసుకెళ్ళటానికొచ్చిన మామగారు శివం ఆఫీసునుంచి రాగానే అన్నాడు.

"అప్పుడే ఏం తొందరలెండి? యీ నెల పోయాక తీసుకెళ్ళకూడదూ?"కోటుతీసి వంకెకు తగిలిస్తూ అన్నాడు అల్లుడు.

"అట్లా అంటే ఎలా నాయనా? యీ బస్తీ కాపురంతో ఎలా అయిపోయిందో చూడు? అందులో తొలి కాన్పు! కాస్త ముందెత్తునే జాగ్రత్తపడాలి."తలుపుల చాటునుండి అత్తగారు రాగంతీసింది.

"సరే మీ యిష్టం!"అన్నాడు శివం వలయం పెంచుకొని వాకిట్లో నుంచొన్న దమయంతిని చూస్తూ.

దమయంతి పెదవులపైకొచ్చిన చిరునవ్వును ఆపుకొంటూ"మరి మీరు రారూ?" అంది.

"అవునబ్బాయ్! నువ్వుకూడా వొస్తే బాగుంటుంది!" అన్నాడు మామగారు సలహా చూచనగా.

"నేనిప్పుడు రావటానికి వీల్లేదులేండి! సెలవు కూడా దొరకదు. దమయంతిని తీసుకెళ్ళండి. ఉదయం ఎనిమిదింటికి జనతా ఎక్స్‌ప్రెస్ వుంది."

* * *

భార్య పుట్టింటికిపోయి రెండు నెలలయింది. శివానికి అనుకున్నదానికంటే తొరగానే గడిచిపోయినై ఆ రెండునెలలూను. హోటల్లో తిండి తిని, ఆ రాత్రి యింటికి తిరిగొచ్చిన శివం మామగారు రాసిన వుత్తరం చదువుకొని సంతోషంలో మునిగిపోయాడు. దమయంతి ప్రసవించింది. కొడుకు పుట్టాడు తల్లీ బిడ్డా క్షేమం. అంతకంటే ఏంకావాలి శివానికి సంతోషాన్ని కలిగించటానికి.

పదిరోజులు సెలవుపెట్టి వుదయం బండిలోనే అత్తవారింటికి ప్రయాణమైనాడు శివం. రైల్లో కూర్చొని శివం కొడుకు రూపురేఖల్నీ పోలికల్నీ మనసులో చిత్రించుకుంటూ వూహల్లో మునిగిపోయాడు. గంటకు నలభైమైళ్ల వేగంతో పోతూన్న బండి చీమనడక నడుస్తున్నట్టుగావుంది, కొడుకునీ, భార్యనీ ఎప్పుడెప్పుడు చూద్దామా అన్న శివానికి.

రైలుదిగి జట్కా మాట్లాడుకొని మామగారింటికి వెళ్ళాడు. శివం జట్కాదిగి యింట్లోకి వెళ్ళేసరికి యిల్లంతా హడావుడిగా వుంది. వసారాలో యిద్దరు పురోహితులు ఏదో తతంగం చేస్తున్నారు. అరుగులమీద కొంతమంది పెద్దలు కూర్చొనివున్నారు. ఇంట్లో ఆడవాళ్లు హడావుడిగా తిరుగుతున్నారు. సావిట్లో బ్రాహ్మణ్ణి చూసేసరికి శివానికి గుండెలు గతుక్కుమన్నయ్! ఏమేమో దారుణమైన ఆలోచనలు ఓ క్షణం పాటు తల్లో కదిలినై కాని అక్కడున్న వాళ్ళ మొహాలు చూస్తుంటే అలాంటి వూహాలకు తావెక్కడాలేదు.

"రండీ! మెయిల్లో వచ్చారా?" అంటూ పరామర్శించి మామగారు శివాన్ని లోపలికి తీసుకుపోయాడు. "అమ్మాయ్! బావొచ్చాడు. కాఫీ తీసుకురా!" అని యింట్లోకి ఒక కేకవేసి తను సావిట్లోకి వెళ్ళిపోయాడు.

హాల్లో కూర్చొని కాఫీ తీసుకొంటూన్న శివందగ్గరికి నడుం వంగిపోయిన ఓ ముసలమ్మ వచ్చి తోలుసంచిలా వ్రేలాడుతూన్న బుగ్గ నొక్కుకుంటూ యిలా అంది—

“ఏరా నాయనా? కొడుకుపుట్టి నెలరోజులైనా యింతవరకూ రావటానికి తీరలేదా?”

శివం నెత్తిమీద పిడుగుపడ్డట్టయింది. తాగుతూన్న కాఫీ పొలమారి ప్రాణం వుక్కిరిబిక్కిరి ఐంది. శివం అయోమయంలో పడిపోయాడు. నెలరోజులనాడు కొడుకు పుట్టడమేమిటి? తనని యిప్పుడు చూడ్డానికి రమ్మని రాయడమేమిటి? అయినా తనకు పెళ్ళయి ఎన్నాళ్ళయింది? నెల కిందటే తనకు కొడుకు పుట్టటమా? ఇదంతా ఏదో చిత్రంగావుందే? కడుపులో అనుమానం దేవుతోంది. దమయంతి గత జీవితంలోకి శివం మనసు పరుగెత్తింది.

అంతలోనే మామగారు అల్లుడిదగ్గరకొచ్చాడు. ఆయన రావడంచూసి ముసలమ్మ పక్కకు తప్పుకొంది.

“ఎన్నాళ్లు సెలవు పెట్టావు?” మామ అడిగాడు,

“ఆఁ. పదిరోజులండీ! దమయంతి నెల క్రిందటే ప్ర-స-విం-చిం” నసిగాడు శివం.

“ఆఁ. అదే చెప్దామనుకుంటున్నాను. పోయిన నెల శనివారం మూడోతేదీన అమ్మాయి ప్రసవించింది. జాతకం చూపిస్తే పిల్లవాడు తండ్రి గండాన పుట్టాడని జ్యోతిష్కులు చెప్పారు. ఆ నెలరోజులూ తండ్రి కొడుకుని చూడకూడదన్నారు. రెండోనెల్లో శాంతి చేశాకే కూడ వచ్చుట! అందుకే ఆ సంగతి నీకు తెలియచేయలేదు యింతవరకూను. ఇవ్వాళే శాంతి చేయిస్తున్నాం. పూజ పూర్తి కావొచ్చింది. తండ్రి రావాలని పౌరోహితుడు పిలుస్తున్నాడు. లే! సావిట్లోకి పద!”

మామ చెప్పిందంతా మౌనంగావిని మామగారి వెనకే లేచి శివం సావిట్లోకి పోయాడు.

మామగారు చెప్పిన సంగతి చెవుల్తోవిన్నా శివం మనసుమాత్రం మారాంచేయడం మానలే. బుర్రమాత్రం యిష్టంవచ్చినట్లు వూహించేస్తోంది. వూపిరి తిత్తులు బిగబట్టినవాడిలా ఆ పూటంతా మునగతీసుకొని తిరిగాడు శివం.

భోజనాలయ్యాక శివం పడకగదిలో చేరి తాపీగా సిగరెట్టు దమ్ములాగుతూ, తొమ్మిదినెలల క్రిందట ఓ వర్షపురాత్రి తన గదిలోకి వంటరిగా వొచ్చిన దమయంతినీ ఆనాటి సంఘటననూ గుర్తుతెచ్చుకొని మనసులో చూసుకొంటూ తన కడుపులో దేవుతూన్న అనుమానాన్ని బలపర్చగల కారణాల్ని వెతుక్కుంటున్నాడు.

కొడుకు నెత్తుకొని దమయంతి గదిలోకి వచ్చింది. దమయంతి పిల్లాణ్ణి భర్తచేతుల్లోకి యిస్తూ సిగ్గును దాచుకొనే ప్రయత్నంలో పెదవులపై చిరునవ్వును తొలికించింది. భర్త ఆరోగ్యాన్ని గురించి, యింటిసంగతుల్ని గురించి ఓవంద ప్రశ్నలు కురిపించేసింది దమయంతి. నంగిగా భార్యకు సమాధానం చెప్తూనే శివం చేతుల్లోవున్న పిల్లాణ్ని నిశితంగా పరీక్ష చేశాడు.

“అబ్బో! ఏంచూసుకుంటూరు లెండి? అంతా మీ పోలికేలెద్దూ!” అంది దమయంతి.

శివం అదో మాదిరిగా చూశాడు భార్య కళ్ళల్లోకి, ఆ కళ్ళ వెనకేదో వున్నట్టు.

“అంతా అదే అచ్చు! నాయనా! బుద్ధులెవరి వస్తాయోగాని?” రాగంతీసింది అత్తగారు తలుపు చాటునుండి. పిల్లాడు బోసినవ్వులు నవ్వుకుంటూ శివంబట్టలు తడిపేశాడు.

పదిరోజులు శెలవుపెట్టి వచ్చానన్న అల్లుడు ఆ రోజే తిరిగి వెళ్ళాలని పట్టుబట్టేసరికి అత్తా, మామా మొహామొహాలు చూసుకొన్నారు. దమయంతి కళ్లుతుడుచుకొంటూ భర్తమొహంలోకి చూసింది.

శివం ఆ రాత్రిబండికే బయలుదేరి వెళ్ళిపోయాడు బరువెక్కిన హృదయంతో.

ఆ రాత్రి వికృతమైన వూహాల్తో బాధపడ్డాడు శివం. సరిగా నిద్రకూడా పోలేక పోయాడు.

ఉదయం లేవగానే లేడీడాక్టరు దగ్గరకెళ్ళి తన కడుపులోవున్న అనూమానాన్ని తీర్చుకొన్నాడు. డాక్టరమ్మ ఎనిమిది నెలలకేకాదు ఏడు నెలలకు ప్రసవించిన బిడ్డలుకూడా ఆరోగ్యంగా బ్రతికిన సంఘటనలుకూడా లేకపోలేదని చెప్పింది. ఆ మాటవిన్నాక శివం హృదయం కొంత తేలిక పడింది. అయినా గాడి తప్పిన మనసు కళ్లెం తెగిన గుర్రంలా చిందులు తొక్కుతూనే వుంది. ఇంకో వారం రోజులు సెలవు తీసుకొని

(ESTD:

1907)

దక్షిణ ఇండియాలో ముఖ్యమైన చోట్లన్నిటిలోను
బొంబాయిలోను బ్రాంచీలు కలవు.

| | | |
|---|---|---|
| చందావేసిన మూలధనము | ... | రు. 72,00,000 |
| చెల్లించిన మూలధనము | ... | రు. 55,40,000 |
| రిజర్వుఫండ్, తదితరఫండులు | ... | రు. 73,50,000 |

అన్ని విధములయిన బ్యాంకింగ్ వ్యాపారములు చేయబడును.

ఎస్. గోపాల అయ్యర్, సెక్రెటరి.

ఇండియన్ బ్యాంక్ లిడ్.,
హెడ్డాఫీసు : మదరాసు

N.P.B

యింట్లోనే వుండిపోయాడు. రాత్రింబవళ్ళు వొకటే ఆలోచన. మనసు ఓదారికి రావడం లేదు. అథవా వచ్చినా అది వచ్చినచోట వుండటములేదు. అతని మనసు మంచుకొండలమీద స్కేటింగ్ చేస్తున్నట్టుంది!

"అంతామీపోలికలే!" భాగ్యమాటలు చెవుల్లో యింకా మోగుతూనే వున్నయ్! పిల్లాడి మొహాన్ని గుర్తు చేసుకోవాల విశ్వప్రయత్నం. అదిసరిగా గుర్తుకొస్తేగా? ఏదోతెలియని బాధ! తీరని ఆవేదన!

అంతవరకూ బాధిస్తున్న ఓ ఆలోచనకు ఆ రోజు లొంగి పోయాడు.

దమయంతి పెట్టెతాళ పగలగొట్టి పెట్టెంతా వెదకడం మొదలు పెట్టాడు. ఏదోవొకటి తన అనుమానానికి ఆధారం దొరుకురుందని ఆశ! చీరల మడతలన్నీ వొక్కొక్కటే జాగ్రత్తగా చూశాడు. పెట్టె అడుగున వుత్తరాలకట్ట కనపడింది! ఒక్కొక్కటే తీసి చదివాడు. అన్నీ తనురాసినవే! ఆ ఉత్తరాల అడుగున కాగితంలో చుట్టిన ఓ ఫోటో చేతికి తగిలింది. దమయంతికీ తనకూ వున్న జీవిత సంబంధాన్ని నిర్ణయించగలిగినది ఆ ఫోటో యేమో? తన భార్య కొడుక్కి తండ్రెవరో తేల్చివేయగలిగింది ఆ ఫోటో ఏమో? ఫోటోకి చుట్టివున్న కాగితాన్ని తీసివేసి ఫోటోలోకి ఆత్రంగా చూశాడు.

అది శకుంతలానాటకంలోని ఓ దృశ్యం—దుష్యంతుని దర్బారు. శకుంతల భరతుణ్ని చూపించి యిదిగో నీ కొడుకని ప్రాధేయపడుతూంటే దుష్యంతుడు అనుమానపు చూపులతో నిరాకరించే దృశ్యం అది!

ఆ ఫోటో తమకాలేజీలో నాటకాలు వేసిన రోజుల్లో తీయించుకొంది. ఆ దష్యంతుడు తనే! ఆ శకుంతల తన దమయంతే! మరి ఆ భరతుడో?

తలుపు నెట్టిన శబ్దంవిని శివం చేతులోవున్న ఫోటోతోసహా వెనక్కి తిరిగి చూశాడు.

దమయంతి కొడుకుని ఎత్తుకొని వాకిట్లో నుంచునివుంది! చేతుల్లోవున్న బిడ్డను ముందుకుచాపి దమయంతి శివం కళ్ళల్లోకి జాలిగా చూసింది. అదేచూపు! శకుంతల వేషంలోవున్న దమయంతి చూసిన చూపే.